◆ కథానిక

# యువతుల యుద్ధం

జయంపు కృష్ణ

**ఇరవై ఒక్క సంవత్సరాలు కూడా పూర్తిగా నిండని చంద్రపుష్పను పోలీసులు అరెస్టు చేశారు.**



భారతదేశంలో వున్న అన్ని స్కాములకంటే అంతం లేని స్కాం 'వరకట్నం'. వరకట్నం కోరలకు ఈనాడు ఎంతమంది అతివలు ఆహుతయిపోతున్నారో లెక్కలేదు. ఎన్నో సమస్యల పట్ల నేడు తీవ్ర ఉద్యమాలు జరిపే నారీలోకం. ఈ సమస్యను తగిన విధంగా పట్టించుకోకపోవడంలో ఆంతర్యం అంతుపట్టదు. మానవ బంధాలకు వ్యతిరేకంగా – వాణిజ్య బంధాలు, యాంత్రిక బంధాలకు ప్రతిరూపం అయిన ఈ వరకట్న రాక్షసి అంతరించేదెప్పుడో? యువతుల హృదయ కుహరాలలో ఆనంద మందారాలు అంకురించేదెప్పుడో?

చంద్రపుష్ప వాళ్ళది మధ్యతరగతి కుటుంబం. వరునివేటలో విసిగిపోయిన ఆమె తండ్రి డిగ్రీ చదివిన చంద్రపుష్పను – ఉన్నవాళ్ళని, కూతురు సుఖపడుతుందని–ఎస్.ఎస్.సి. పలుమారులు తప్పిపోయినా, కూతుర్ని యిష్టపడ్డ గోపాల్‌కిచ్చి పెళ్ళి చేశాడు. ఉద్యోగం చేస్తాననీ, కుటుంబానికి చేదోడు, వాదోడుగా వుంటాననీ, తన వివాహం విషయం తానే చూసుకుంటాననీ చంద్రపుష్ప ఎంత వాదించినా, విలపించినా–ఆమె తల్లిదండ్రులు వినిపించుకోనేలేదు. అస్సలు ఆమెను మాట్లాడనీలేదు.

"ఆడపిల్లవు. అలా మాట్లాడకూడదు. నీ తరువాత యిద్దరు ఆడపిల్లలు ఈడేరి పెళ్ళికి సిద్ధంగా వున్నారు. గుండెల మీద కుంపటికాకు; మిగిలిన వారికి అడ్డుగా మిగలకు–" అంటూ వత్తిడిచేసి, పెళ్ళికి ఒప్పించారు.

చంద్రపుష్ప ఇష్టం లేని పెళ్ళికి తలవంచక తప్పిందికాదు. అయితే చేసుకున్న వాడికి యిస్తామన్న కట్నం పూర్తిగా ఇవ్వలేకపోయారు కన్నవారు. అది తీసుకురమ్మని సాధించసాగారు, కట్టుకున్నవాడు, అత్తగారు; మామలేదు. అందంగా, అమాయకంగా వుంది. తనపాణి గ్రహణం చేసిన భర్త, నాతిచరామి అంటూ పెళ్ళి ప్రమాణాలు వల్లించిన భర్త–వచ్చి తాగుబోతని, పిచ్చితిరుగుబోతని–పెళ్ళయ్యాక తెలిసిన చంద్రపుష్ప నివ్వెరపోయింది. ఆమె కన్నె కలలు, 'కన్న కలలు కలుషిత'మయ్యాయి; తరిగిపొయ్యాయి.

మిగిలిన కట్నం కోసం పదేపదే వేధించసాగారు అత్త, భర్త. చంద్రపుష్ప అమ్మగారింటికి ఎన్నిమార్లెళ్ళినా లాభం లేకపోయింది. అయినా 'పనీ, బాటా లేని భర్త ఓసారి ఏదో వ్యాపారం చేస్తానంటూ వత్తిడితేస్తే–అమ్మగారింటికి వెళ్ళి, ఇల్లు తాకట్టు పెట్టించి, అతికష్టం మీద కొంత సొమ్ము సర్దకలిగింది. కానీ ఆ డబ్బుతో వ్యాపారం చెయ్యక, విలాసాలకు ఖర్చు పెట్టేసిన గోపాల్, తిరిగి వెంటనే డబ్బు తెమ్మంటూ చంద్రపుష్పను హింసలు పెట్టసాగాడు.

చివరకు గోపాల్ తన వుంపుడు గత్తెను ఇంటికి తెచ్చుకున్నాడు. భార్య మీద పెత్తనానికి నియమించాడు. ఎలాగయినా డబ్బు తెచ్చేలా బాధలు పెట్టసాగాడు. అత్త కూడా అందుకు అంగీకరించినట్టు మౌనం వహించింది. అడిగిన కోడలికి, "వాడు మగాడు ఏమైనా చేస్తాడు. అది వాడి యిష్టం. నిన్ను చేసుకున్నాడు. నీయబ్బ అడిగినంత కట్నం చెల్లించలేదు. నీతో వాడికి సుఖం లేదు; సంతోషం లేదు–దరిద్రం ముఖమూ, నువ్వును. అందుకే వాడు యిష్టమొచ్చిన దాన్ని వుంచుకున్నాడు. నీకు చేతనయితే, నువ్వు నిజమైన ఆడదానివయితే – నీయబ్బ నడిగి డబ్బుతెచ్చి వాడికివ్వు. నీ వాణ్ణే చేసుకో, అంతేగాని అనవసరంగా మాట్లాడి, మరింత నరకాన్ని కోరి తెచ్చుకోకు" అంటూ ఓ చిన్నసైజు ఉపన్యాసాన్ని దంచింది. భర్త చేస్తున్న నీచపు పనికి, యివ్వాల్సిన కట్నానికి, అత్త చెప్పిన ఆర్థిక సూత్రానికి – సంబంధమేమిటో ఎంత ఆలోచించినా చంద్రపుష్పకు అర్థం కాలేదు.

రాత్రంతా ఏడ్చిఏడ్చి కన్నీళ్ళు ధారికలు కట్టాయి. అప్పుడప్పుడే కడుపులో ప్రాణం పోసుకుంటున్న బిడ్డ, కడుపులో ప్రేవులు దేవినట్టయింది. ఒక 'కన్నె పిల్లకు పదిమందిలో తాళికట్టి తన భార్య అనిపించుకుని, ఆమె శరీరాన్ని పంచుకుని, అర్థాంగని ఆ మగాడు తన యిష్టం వచ్చినట్టు తిరగొచ్చు; మాటాడొచ్చు; ప్రవర్తించవచ్చు యీ దేశంలో. కానీ, స్త్రీ?–

ఎంత వివక్షత? స్త్రీకి ఎందుకింత శిక్ష??

ఇంతమందున్నారు దేశంలో – ఒక్కరూ పెదవి విప్పరేం?? ప్రశ్నించరేం?? గొంతెత్తి పెద్దగా అరవరేం?? ఎదురు తిరగరేం??–

చంద్రపుష్ప ఎంత ఆవేదనపడ్డా, ఆమె కన్నీటి ధారకు జవాబు దొరకలేదు. ఆమె కష్టాన్ని, కన్నీటిని – ఆర్పేవారు, తీర్చేవారు కనిపించనేలేదు. ఎన్నాళ్ళీ యువతుల యుద్ధం?



**ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక తెలుగు కళాసమితి (న్యూ జెర్సీ) రాజాలక్ష్మి ఫౌండేషన్ (మద్రాసు) సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీల్లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

ఎంతకూ చంద్రపుష్ప నుంచి డబ్బు రాకపోవడంతో ఆమె భర్త, అత్త ఓ నిర్ణయానికొచ్చారు.

ఆ రాత్రి బాగా పొద్దుపోయాక-భార్యని పిలిచాడు భర్త- "పుష్పా! నిన్ను పెళ్ళి చేసుకుంది నీ మీద మోజుపడి కాదు; నువ్వు తెచ్చే కట్నం కోసం. అది తీసుకురానప్పుడు నువ్వు నాకు అనవసరం. నువ్వుచస్తే నేను మరో పెళ్ళి చేసుకుంటాను. అప్పుడు నాకు మళ్ళీ కట్నం వస్తుంది. నాకు డబ్బే ముఖ్యం. మర్యాదగా చెబుతున్నాను. మీ వాళ్ళిస్తామన్న కట్నంలో సగానికిపైగా నాకు రావాల్సి వుంది. అది నువ్వు వెంటనే తెచ్చివ్వాలి. లేకపోతే నువ్వు పక్కింటి వాడితో అక్రమ సంబంధం పెట్టుకున్నావని పేచీ పెడతాను. ఒక పథకం ప్రకారం ప్రచారం చేస్తాను. ఆ తర్వాత మరోపెళ్ళి చేసుకుంటాను. ముందే చెప్పానుగా నాకు డబ్బు ముఖ్యమని. ఆడదాని అడ్డు ఎలా తొలగించుకోవాలో నాకు బాగా అనుభవం. ఎలాచేస్తే బావుంటుందో నువ్వే తేల్చుకో" అన్నాడు తాగినమైకంలో సిగరెట్ పొగ చంద్రపుష్ప ముఖం మీద దట్టంగా వదులుతూ గోపాల్.

ఇన్నాళ్ళు తనను ఎన్ని బాధలు పెట్టినా భరించింది. తన తల్లిదండ్రులను ఎంతనీచంగా మాట్లాడినా కూడా మౌనం వహించింది. కానీ... కానీ...ఈరోజు అక్రమ సంబంధం తనకు అంటగట్టడం మాత్రం సహించలేకపోతోంది. తాళికట్టిన భర్త అలా ఎగతాళిగా మాట్లాడం వూహించుకోలేకపోతోంది – గుండెను ఎవరో పిండినట్టు విలవిలలాడిపోతోంది–

"తేల్చుకో! దూలానికి ఉరి బిగించుకుంటావో? కిరోసిన్ పోసుకుని, ఒళ్ళు కాల్చుకు చస్తావో? లేక వెంటనే వెళ్ళి. డబ్బు తెచ్చిస్తావో? తేల్చుకో. రేపటికల్లా తేలిపోవాలి" అత్తగారి అల్టిమేటం, అత్తగారింట్లో అత్తంటే తల్లికి మారురూపం అంటారు. ఆమెనోట కూడా యిలాంటి మాటలు? అసహ్యమేసింది చంద్రపుష్పకు. 'తనను వ్యాపారానికి పనికివచ్చే ఒక వస్తువుగా చూస్తున్నారే తప్ప మనసున్న మనిషిలా; రక్తమాంసాలున్న ఓ జీవిలా చూడడం లేదు. ఇలాంటివారు డబ్బు తెచ్చాక కూడా తనను బ్రతకనిస్తారని నమ్మకం ఏమిటి? మరో యువతిని కూడా యిలా బరిలోకి లాగి, బలిపశువుగా చేయరని...ఓహ్..విధ్వంసమవుతున్న మానవ బంధాలను; విచ్ఛిన్నమవుతున్న మానవతా విలువలను చూస్తూ మౌనం వహించలేకపోయింది చంద్రపుష్ప మనసు. ఎదురు తిరిగింది –

"ఛీ! మీరు మనుషులు కారు. పెళ్ళానికి అక్రమ సంబంధం అంటగట్టినవాడు మొగుడు కాదు; అత్తాకోడళ్ళ సంబంధానికి డబ్బును ముడిపెట్టి, అసమర్థుడు వ్యసనపరుడైన కొడుకును సమర్థించి–చావుకు ఏ మార్గాన్ని ఎన్నుకుంటావో తేల్చుకోమంటున్న ఆమె అత్తకాదు. ఈ మొగుడూ వద్దు; ఈ కమర్షియల్ కాపురమూ వద్దు. డబ్బు కోసం ఎంత మందిని యిలా గొంతులు కోస్తారు? లేదు. అలా జరగడానికి వీల్లేదు. ఇప్పుడే మీ గుట్టు రట్టు చేస్తాను. మీ బండారం బయట పెడతాను...."అంటూ ఆవేశంగా, ఆక్రోశంగా అరవసాగింది చంద్రపుష్ప పిచ్చిదానిలా వూగిపోతూ...

అమ్మ కొడుకు దేస చూసింది. కొడుకు మౌనంగా వెళ్ళి, టీవి సౌండ్ పెద్దది చేశాడు. అత్త చటుక్కున లైట్స్ ఆఫ్ చేసింది. ఆ ఇద్దరూ కలిసికట్టుగా చంద్రపుష్పను చావగొట్టారు. పరిస్థితి అదుపు తప్పడంతో చచ్చిందనుకున్నాక, గోనెసంచిలో కట్టి, బాత్ రూంలో పడేశారు–పనికిరాని గొడ్డును కసాయికి తోలేసినట్టు.

తల్లి గోపాల్‌తో ఏదో మాట్లాడి, తన గదిలోకి వెళ్ళి తలుపులు బిడాయించుకుంది.

అర్ధరాత్రి వరకు బాగా తాగాడు గోపాల్. ఆ తర్వాత తూలుతూవెళ్ళి, బాత్‌రూంలో భార్య వున్న గోనెసంచిపై కిరోసిన్ పోసి, అగ్గిపుల్ల వెలిగించడంలో కాలుజారిపడి, మళ్ళీ పైకిలేవలేక అవస్థపడసాగాడు కిక్కు పైకెక్కడంతో–

కొనవూపిరితో వున్న చంద్రపుష్ప అప్పటికి స్పృహ తెచ్చుకుని, పరిస్థితిని గమనించి, ధైర్యాన్ని కూడగట్టుకుని, కాళ్ళతో తన్ని, గోనెసంచిలోంచి బయట పడింది. జరిగింది జ్ఞాపకం వచ్చి ప్రళయకాళిలా మారింది. మత్తుగా లేచి, మళ్ళీ తన మీదికి రాబోతున్న గోపాల్‌ను పక్కనే ఉన్న స్టీలు బక్కెట్టుతో బలంగా కొట్టి, అదే గోనెసంచిలో కట్టింది. డబ్బాలో యింకా మిగిలివున్న కిరోసిన్ పోసి, అగ్గిపుల్ల అంటించి, తగలబెట్టింది కసిగా–

వరకట్నం చావులో ఎంతోమంది యువతులు– తన చావుకు కారణం ఎవరూ కాదని– వంట చేస్తుంటే పొరపాటున చీర అంటుకుందని– స్టౌ పేలిందని– దీపారాధన చేస్తూవుంటే ప్రమాదవశాత్తూ చీర చెంగు అంటుకుందని–తన భర్త దేవుడని– తన మరణ వాంగ్మూలంలో చెప్పి, చివర శ్వాస వదులుతుంటారు.

కానీ– గోపాల్ మాత్రం– తన చావుకు కారణం తన భార్య చంద్రపుష్ప 'అనీ–చెడు తిరుగుళ్ళకు అలవాటుపడ్డ తన భార్యను నిలదీసినందుకు, తన అడ్డు తొలగించుకోవాలని, తాగిన మత్తులో వున్న తనపై – ఆమె, ఆమె ప్రియుడు కలిసి – యింత అఘాయిత్యానికి పాల్పడ్డారని చెప్పి మరీ కళ్ళు మూశాడా ఖలుడు–

చంద్రపుష్పను పోలీసులు అరెస్టు చేశారు. ◆